www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023
5
ఏలూరు



ఉత్సాహభరితంగా సంక్రాంతి సంబరాలు


6లో..
జంగారెడ్డిగూడెంలో భోగి మంటలతో యువత సందడి

బరులు.. బేరసారాలు..!

రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ మామూళ్లు
పోలీసులతో నిర్వాహకులు బిజీబిజీగా మంతనాలు!
గుండాట, మూడు ముక్కలాటల నిర్వహణకూ ఏర్పాట్లు
నేటి నుంచి కోడి పందేల ప్రారంభానికి సర్వంసిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడిపందేల నిర్వహణకు సంబంధించి పందేల నిర్వాహకులు పోలీసులతో బిజీబిజీగా మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. భోగి రోజు నుంచి పందేలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వనుండటంతో అందుకు తగినట్లుగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. పోలీసుల నుంచి ఇబ్బందులు లేకుండా ముందుగానే మామూళ్లు ముట్టజెప్పి కట్టడి చేసేందుకు మంతనాలు సాగిస్తున్నట్లు తెలిసింది. బరుల ప్రాతిపదికన మామూళ్లను నిర్ణయిస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులకు ఇచ్చే మామూళ్లు బరుల ప్రాతిపదికన నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. చిన్న బరులకైతే రూ.30 వేలు, ఓ మోస్తరు బరులకు రూ.50 వేలు, పెద్ద బరులైతే రూ.లక్ష, భారీ పందేలు నిర్వహించే బరులకైతే రూ.రెండు లక్షల వరకూ సైతం మామూళ్ల నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పటికే మామూళ్లకు సంబంధించిన ప్రక్రియ చాలావరకూ పూర్తయినట్లు చెబుతున్నారు. ఈ మామూళ్ల కిందిస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి వరకూ వెళ్లనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వమే అనధికారికంగా పందేలకు అనుమతి ఇవ్వనుండటంతో నిర్వాహకులు అందుకు తగినట్లుగా ముందుగానే అన్ని చర్యలూ చేపడుతున్నారు. మామూళ్ల, ఏర్పాట్లకు సంబంధించిన సొమ్ము వసూళ్లకు నిర్వాహకులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకున్నట్లు చెబుతున్నారు. గుండాట, మూడుముక్కలాట నిర్వాహకులు ఎంతివ్వాలి, ప్రతి పందేనికి సంబంధించి పందెం సొమ్ములో ఎంత శాతం కేటాయించాలనే నిర్ణయాలు ఇప్పటికే జరిగిపోయినట్లు చెబుతున్నారు. మోస్తరు బరులకు సంబంధించిన నిర్వాహకులు రూ.ఏడు నుంచి ఎనిమిది లక్షలు, పెద్దబరులు నిర్వాహకులైతే రూ.25 లక్షల వరకూ మిగిలేలా ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. పెద్దబరుల వద్ద మర్యాదలు చోటుచేసుకోకుండా బౌన్సర్లను సైతం రంగంలోకి దింపేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో సిద్ధం చేశారు. భోగి రోజు ఉదయం 11 గంటల వరకూ పోలీసుల హడావుడి ఉంటుందని, అక్కడ నుంచి యథేచ్ఛగా సాగే అవకాశం ఉందని నిర్వాహకులే ప్రచారం చేస్తున్నారు. పందేల్లో పోటీపడే పుంజులను ఇప్పటికే అన్నిరకాలుగా సిద్ధం చేసుకుని పందెంరాయుళ్లు సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా పండుగ రోజు భారీఎత్తున పందేలు జరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.




ఉంగుటూరు మండలంలో పందేలకు నిర్వాహకుల ఏర్పాట్లు

ఆర్థిక స్థోమతను బట్టి బరుల ఎంపిక

తమ ఆర్థిక స్థోమతను బట్టి పందెంరాయుళ్లు ఏ బరిలో పందేల్లో పాల్గొనాలనే దానిపై నిర్ణయాలు తీసుకుంటున్నారు. ధనవంతులంతా భారీ పందేల వద్దకు క్యూ కట్టే పరిస్థితి ఉండగా, ఓ మోస్తరు పందేలు, అంతకంటే చిన్న పందేలు వేసేవారు తమతమ స్థోమతను బట్టి బరులను ఎంపిక చేసుకుంటున్నారు. సంక్రాంతి కోడి పందేల కోసం ఇప్పటికే అప్పులు చేసి మరీ సొమ్ము సిద్ధం చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. పేకాటరాయుళ్లు సైతం పెద్దఎత్తున ఆడేందుకు తోటలు, ఊరు చివర ఇళ్లలో ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. పందేలు చూసేందుకు వెళ్లేవారు గుండాట, మూడుముక్కలాటలకు ఆకర్షణకు గురై జేబులు గుల్ల చేసుకునే పరిస్థితి ఏర్పడనుంది. గుండాటలో కూడా కనీసంగా రూ.వంద ఉండేలా నిబంధనలు పెడుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తే పండగ మూడురోజులూ రూ.వందల కోట్లలో బెట్టింగ్ జరగనున్నట్లు అంచనా వేస్తున్నారు.


జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో డింకీ పందేల్లో ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా

పండుగ సంతోషంగా జరుపుకోవాలి


ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్

సంక్రాంతి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి కుటుంబమూ సంతోషంగా జరుపుకోవాలి. ప్రజలందరూ సుఖ సౌఖ్యాలు, భోగభాగ్యాలతో ఉండాలి.

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు


పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్


ఈ సంక్రాంతి పండుగ ప్రతిఒక్కరి జీవితంలో కొత్త వెలుగులు నింపాలి. జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు. భోగభాగ్యాలు ఈ సంక్రాంతి అందరి ఇంటా కలల పంట పండించాలి.


చింతలపూడిలో..

జిఒ1 కాపీల దహనం

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెం.1ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ప్రధాన సెంటర్‌లో శుక్రవారం ఆ జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ ఆ జిఒను ఉపసంహరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళరావు, నేతలు వీరవల్లి భాస్కరరావు, అద్దాని వెంకటేశ్వరరావు, పాతపాటి జ్ఞానేష్, కార్యకర్తలు ముంగం సురేష్, కుడిపూడి శ్రీనివాసరావు, గద్దె అనిల్ కుమార్, జక్కుల మహేష్, పంతగాని ప్రకాష్, చిన్నం శ్రీకాంత్, పెరుమాళ్ల సత్యన్నారాయణ, రమేష్, జోజిబాబు, బుస్సా నాగేంద్రం పాల్గొన్నారు.


చింతలపూడిలో..

చింతలపూడి : జిఒ1 అమలైతే పౌరహక్కులకు భంగం వాటిల్లుతుందని ఎఐటియుసి జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి బాబు అన్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలపై నిర్బంధాలను విధిస్తూ తీసుకొచ్చిన ఈ జిఒను రద్దు చేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిఒ కాపీలను స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంనాటి జిఒను వైసిపి ప్రభుత్వం తీసుకురావడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉందని, తక్షణం ఈ జిఒను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఎఐటియుసి నాయకులు పుప్పాల సత్యనారాయణ, దేవినేని రమేష్, దేవినేని ప్రసాద్, శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వరరావు, తిరుమల శ్రీనివాస్ ఉన్నారు.

కోడి పందేలను..
ప్రజాప్రతినిధులే ప్రోత్సహించడం దారుణం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, జూద క్రీడలను ప్రజా ప్రతినిధులు ప్రోత్సహించడాన్ని ఖండించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు పూర్తవుతున్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికే జిల్లాలో పెద్ద ఎత్తున రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కోడిపందేలను, జూదక్రీడలను, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు పెద్దఎత్తున పనిచేస్తుంటే జిల్లాలో ప్రజాప్రతినిధులు జూద క్రీడలను ప్రోత్సహించడం అనాగరికతను గుర్తు చేస్తుందన్నారు. ప్రభుత్వం, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి అలాంటి వాటిని ప్రోత్సహించే ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సర్దుబాటు ఆపాలి

ఏలూరు టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును నిలుపుదల చేయాలని కోరుతూ ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షులు పిబివిఎల్ఎన్.నారాయణ, సెక్రటరీ జనరల్ జి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు, కోచైర్మన్లు బి.మనోహర్, కె.నరహరి, ఏలూరు కో ఛైర్మన్లు ఆదినారాయణ, ఎమ్‌డి.జిలాని, డిప్యూటీ సెక్రటరీ జనరల్ పివి.నరసింహారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బుజ్జిబాబు

రైతులంతా పంట నమోదు చేసుకోవాలి
వ్యవసాయ శాఖ ఎడి బుజ్జిబాబు

జీలుగుమిల్లి: మండలంలోని రైతులంతా ఫిబ్రవరి 15 తేదీలోపు పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బుజ్జిబాబు కోరారు. శుక్రవారం దర్భగూడెం రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన రైతు సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ పిఎం కిసాన్ యోజన పథకంలో నమోదు చేసుకున్న రైతులు బయోమెట్రిక్ వేయాలన్నారు. దీనికి అగ్రికల్చర్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివర దశకు చేరుకుందన్నారు. ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.గంగాధర్, అసిస్టెంట్లు రష్మి, దుర్గ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పోరు
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ఏలూరుటౌన్:రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం సిపిఐ శ్రేణులు పోరాటాల చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి సమావేశం గేదెల నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశంలో వనజతోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజల హక్కులను హరించేలా ఉన్న జిఒ నెం.1కు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ జిఒ అప్రజాస్వామికమని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జిఒలను రద్దు చేసే వరకూ పోరాడాలన్నారు. ప్రభాకర్, చైతన్యకృష్ణతోపాటు ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మాట్లాడారు. అనంతరం ఏరియా సమితి సహాయ కార్యదర్శిగా కురెళ్ల వర ప్రసాద్, ఏడుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న బరులు..!

ప్రజాశక్తి - ఉంగుటూరు

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసేశారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం హెచ్చరికలను లెక్కచేయకుండా సకల ఏర్పాట్లను పందెంరాయుళ్ల పూర్తి చేయడం గమనార్హం. మండలంలో గతంలో రెండు బరులు ఉండేవి. ఈసారి నిడమర్రు మండలం పత్తేపురం నుంచి నారాయణపురానికి బరి బదిలీ అయింది. దీంతో నారాయణపురం-గణపవరం మార్గంలో బరులను ఏర్పాటు చేయడంతో ారాయణపురంలో మూడు బరులు అయ్యాయి. ఈ మూడూ అధికారి పార్టీ నాయకులకు చెందినవే కావడం గమనార్హం. ఇప్పటికే పందేలకు రమ్మని ఆహ్వానాలు కూడా వెళ్లిపోయాయి. ఓ మాజీ మంత్రి పండుగ మూడు రోజులూ ఇక్కడే మకాం ఉంటారని చెబుతున్నారు. ఆయనకు చెందిన సుమారు 25 నుంచి 30 పుంజులు సైతం పందేలకు రెడీగా ఉన్నాయి. ఒక్కో పందెం రూ.రెండు లక్షలు పైనే ఉండబోతోందని ప్రచారం సాగుతోంది. కొత్త ఉంగుటూరు, నారాయణపురం వైఎస్ఆర్ కాలనీ, బాదంపూడి మత్స్య కేంద్రం పక్కన, చిన్నవెల్లమిల్లిలో వ్యవసాయ పొలం, గొల్లగూడెం శివాలయం చెరువు గట్టు సమీపం, రాచూరులో సచివాలయానికి ఎదురుగా స్థలంలో కోడి పందేలు, గుండాట, పేకాట తదితర జూద క్రీడలు నిర్విరామంగా సాగేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. ఫ్లడ్ లైట్లు, అతిధుల వీక్షణ కోసం స్టేజీ డెకరేషన్‌తో తీర్చిదిద్దుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కోడి పుంజులు ప్రత్యేక వాహనాల్లో ఇప్పటికే ఈ ప్రాంతానికి చేరాయి.



ముదినేపల్లిలో..

ముదినేపల్లి:సంక్రాంతిని పురస్కరించుకుని కోడిపందేలు, జూదాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు మండలంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వడాలి, అన్నవరం ,బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో ఉన్న ఖాళీస్థలాల్లో నేలను చదును చేయగా, మరికొన్ని గ్రామాల్లో నేలను చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారి కోడిపందేలు, జూదాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు అధికార పార్టీకి చెందిన పెద్దలు కసరత్తు చేస్తున్నారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన గ్రామాలతోపాటు కొత్తగా మరికొన్ని గ్రామాల్లో పందేల నిర్వహణకు అనుమతులు కోసం నిర్వాహకులు పోలీస్ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా తగ్గేదేలేదంటూ నిర్వాహకులు బహిరంగంగానే స్పష్టం చేస్తున్నారు.

కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకు స్థాన చలనాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


ఎన్నో ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగం చేస్తూ బదిలీ అవకాశం లేక అవస్థలు పడుతున్న వైద్య ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకు ఎట్టకేలకు స్థాన చలనాలు జరిగాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ఎపి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జివివి.ప్రసాద్ శుక్రవారం విలేకరులకు వివరించారు. వైద్య ఆరోగ్యశాఖలో కొత్తగా వచ్చిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు అదే శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులతో ఏళ్ల నాటి సమస్యకు తెరపడిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 20 ఏళ్లుగా బదిలీలకు నోచుకోకుండా ఒకే చోట పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల 410 మంది ప్లెయిన్ ఏరియా వారికి, 25 మంది ఏజెన్సీ హెల్త్ అసిస్టెంట్లకు స్థాన చలనం కలిగే అవకాశం వచ్చిందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు చొరవ, చాకచక్యంతో గురువారం ఉదయం ప్రారంభమైన కౌన్సెలింగ్ ప్రక్రియ పగలూ, రాత్రీ జిల్లా కార్యాలయ ఉద్యోగులు ఎంతగానో శ్రమించి శుక్రవారం తెల్లారుజామునకు పూర్తి చేయగలిగారన్నారు. ఏళ్లుగా బదిలీల కోసం పలు ఇబ్బందులు పడుతున్నా తమను బదిలీ చేయండి మహాప్రభో అని ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు ఎన్నో సార్లు వేడుకున్నప్పటికీ తమ వేదన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల దయవల్ల రెండేసి హెల్త్ క్లినిక్‌లకు ఒక్కొక్కరికి సర్దుబాటు చేసే అవకాశం దక్కిందన్నారు. చేసేది కాంట్రాక్టు ఉద్యోగం కావడం, చాలీ చాలని జీతాలతో దాదాపు వంద కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ ఎన్నో వ్యయ ప్రయాసలు పడే ఎందరికో ఇప్పుడు జరిగిన స్థాన చలనాలతో సొంత ఊళ్ళకు సమీపంలోకి వచ్చామని ఉద్యోగులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా, కుటుంబ సభ్యులకు దగ్గరగా ఉద్యోగం చేసుకునే అవకాశం దక్కడంతో కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాల్లో ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చినట్లు అయిందని ప్రసాద్ పేర్కొన్నారు. కౌన్సిలింగ్ ప్రక్రియ ఎంతో సజావుగా నిర్వహించి ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా ఎంతగానో శ్రమించిన డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరరావుకు, జిల్లా కార్యాలయ ఉద్యోగులకు, ప్రధానంగా ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యోగుల పక్షాన నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లా అప్పారావుకు, కాంట్రాక్టు ఉద్యోగుల తరపున జివివి.ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.


డిఎంహెచ్ఒను సత్కరిస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు

సింగరాయపాలెంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పెద్దసంఖ్యలో యువతులు పాల్గొన్నారు. ఆనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్ఐ షణ్ముఖసాయి నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బోయిన విమల, సచివాలయ కార్యదర్శి లక్ష్మీ, వైసిపినేత బోయిన రామరాజు, గ్రామప్రముఖులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్ఐ

మద్ది ఆలయంలో హీరో కిరణ్ అబ్బవరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో సినీ హీరో కిరణ్ అబ్బవరం సందడి చేశారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన ఆయనను ఆలయ సిబ్బంది ఆహ్వానించి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షకులు జావ్వాది కృష్ణ పాల్గొన్నారు.


ఆలయంలో హీరో కిరణ్ అబ్బవరం



డ్రైడే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల ద్వారా వచ్చే ప్రాణాంతక వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వాటిని నివారించొచ్చని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టైటాస్ నగర్‌లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జ్వరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని, జ్వరంమొస్తే అశ్రద్ధ చేయకుండా దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని, అక్కడ అన్ని పరీక్షలూ ఉచితంగా చేస్తామని సూచించారు. దోమల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలైన నీటి తొట్టెలు, డ్రమ్ములు వారానికి ఒకసారి శుభ్రం చేయాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దత్తచరణ్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రమేష్ ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందేల సమాచారమివ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు వారు వివిధ ప్రజాప్రయోజనాల వ్యాజ్యాల కేసు విషయంలో జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం, పక్షులు, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం1960, ఎపి గేమింగ్ చట్టం 1974 ప్రకారం కోడిపందేలు, బెట్టింగులు నిర్వహించడం, ప్రోత్సహించడం, పాల్గొనడం చట్టవిరుద్ధమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే శిక్షార్హులని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా పై ఉత్తర్వులను అతిక్రమించిన, ఆ సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నెం.08812-224519 లేదా టోల్ ఫ్రీ నెం.1800-2331077, ఫొటోలు, వీడియోలను వాట్సయాప్ నెంబర్లు, 9491041435కు పంపాలని కోరారు.


హతమైన పాము

ఎమ్మెల్యే కార్యాలయంలో తాచుపాము హల్‌చల్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా క్యాంప్ కార్యాలయంలో తాచుపాము శుక్రవారం హల్‌చల్ చేసింది. కార్యాలయంలోకి ప్రవేశించిన పాము కారు ఇంజన్ భాగంలోకి ఎక్కే సమయంలో గన్‌మెన్ భుజంగరావు గమనించారు. వెంటనే కారులోకి పాము ఎక్కకుండా కిందకు లాగేశారు. తాచుపామును చూసిన వారు భయంతో కేకలు వేయడంతో స్థానికులు కర్రతో కొట్టి హతమార్చారు.


మెటీరియల్‌తో అభ్యర్థులు

గ్రామీణ యువతకు ఉద్యోగ కల్పనే ఎయిమ్ లక్ష్యం

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించాలనే లక్ష్యంతోనే ఎయిమ్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు ఎయిమ్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్.రాజేంద్ర, జిల్లా నాయకులు కాకర్ల సత్యం అన్నారు. స్థానిక ఎఎంసి మార్కెట్ వద్ద రాష్ట్ర సిఐడి డిజిపి పివి.సునీల్‌కుమార్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్ వద్ద మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతోనే ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ మండల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటమణి

తెగుళ్ల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - మండవల్లి

మినుము పంటను ఆశించే చీడపీడలపై సత్వర చర్యలు చేపడితే నష్టాన్ని తగ్గించుకోవచ్చని వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి అన్నారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం వెంకటమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైరుకు పురుగు ఆశించినట్లు గమనించిన వెంటనే చర్యలు చేపట్టి నివారించుకుంటే మినుము పంట ఆశాజనకంగా ఉంటుందన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు 90శాతం పూర్తయిందన్నారు. మూడో విడత రైతు భరోసా ఈ నెలలో రైతుల ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. అదేవిధంగా కిసాన్ పథకంలో డ్రోన్లను సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. కొత్త టెక్నాలజీ రైతులకు సులభతరంగా ఉంటుందన్నారు. ఇకెవైసి చేయించుకోని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే చేయించుకోవాలని, లేకుంటే పిఎం కిసాన్ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా బరుల ఏర్పాటు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలవ్యాప్తంగా కోడిపందేల నిర్వహణకు సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన బరులను గుర్తించి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పందేలకు అనుమతులు లేవని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పోలీసులు హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం పలుచోట్ల గుట్టుచప్పుడు కాకుండా పందేలకు ఏర్పాట్లు చేస్తున్నారు.


నేరాలు - ఘోరాలు

డివైడర్‌ను ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. గుండుగొలను - కొవ్వూరు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్న దూది శేఖర్ తన అక్క సౌజన్య, తల్లి గిరిజ, ఇతర కుటుంబ సభ్యులు కలిసి దేవరపల్లి మండలం దుద్దుకూరు కారులో బయలుదేరారు. అంబరుపేట వద్ద ముందుగా వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో శేఖర్ అక్క, తల్లితో పాటు మేనల్లుడు శ్రీరాజ్ గాయపడ్డారు. వీరిని రోడ్ సేఫ్టీ విభాగపు సిబ్బంది అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఎస్ఇబి కార్యాలయ పరిధిలోని నారాయణపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎయిబి. సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం స్టేషన్ హౌస్ ఆఫీసర్ భీమడోలు ఎస్ఐ సుబ్బారావు, ఇతర సిబ్బందితో కలిసి నారాయణపురం వద్ద రూట్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిల్‌పై తరలిస్తున్న అరుణాచలప్రదేశ్‌కు చెందిన 96 మద్యం సీసాలను పట్టుకున్నారు. మద్యాన్ని తరలించడానికి వినియోగించిన వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. ఒక వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.


మద్యం బాటిళ్లతో నిందితుడు

ఉత్సాహభరితంగా సంక్రాంతి సంబరాలు

ఆటల పోటీల నిర్వహణ - ఉత్సాహంగా పాల్గొన్న యువత - విజేతలకు బహుమతులు అందజేత


ఏలూరులో..


భీమడోలులో..

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థులు, యువత వ్యసనాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సిఐటియు నాయకులు పి.కిషోర్ అన్నారు. తిప్పాని లక్ష్మీ కాంతం స్మారక ట్రస్ట్ (జనరిక్ మందుల షాప్) ఆధ్వర్యంలో డివైఎఫ్ఐ సంక్రాంతి సంబరాలు తూర్పు వీధి, కస్తూర్బా దొడ్డి ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో 30 ఏళ్ళ నుండి ప్రతి ఏటా డివైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 30 డివిజన్లలో 50 కేంద్రాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంక్రాంతి అనేక వ్యవసాయ పంటల పండుగ అని, తెలుగు ప్రజల ప్రియమైన పండుగ అని అన్నారు. ప్రస్తుత సమాజంలో మత్తుపదార్థాలు యువతను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. ఏలూరులోని విద్యాలయాల కేంద్రంగా (డ్రగ్) పంపిణీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, బాల సంఘం నిర్వాహకులు సిహెచ్.ఆంథోని, స్థానిక పెద్దలు ఇ.శాంతారావు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఏలూరు టౌన్: పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పట్టణ స్థాయి ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిథులుగా ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పెదబాబు, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందువులకు అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని అన్నారు. తొలుత అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత భోగి మంటలు వెలిగించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన గంగిరెద్దుల విన్యాసాలను తిలకించారు. డ్వాక్రా మహిళలు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇళ్ల వద్ద తయారు చేసి తీసుకొచ్చిన వివిధ రకాల పిండి వంటలు ప్రదర్శించి, అందరికీ పంచారు. చిన్నారుల జానపద, భరతనాట్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో టిఎల్ఎఫ్ పట్టణ అధ్యక్షులు గుడిదేశి లక్ష్మి శారద, మెప్మా పీడీ ఇమ్మానియేల్, అసిస్టెంట్ కమిషనర్ చోడే బాపిరాజు, పిఒ కృష్ణమూర్తి, మున్సిపల్ ఆర్ఒలు, మెప్మా సిబ్బంది, సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

భీమడోలు: యువత, విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, వ్యసనాలబారిన పడొద్దని గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.గౌతమ్ కుమార్ సూచించారు. స్థానిక కళాశాల ఆవరణలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఉదయ్ కిరణ్ భోగి మంటలు వేసి సంబరాలను ప్రారంభించారు అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ ఆటలు, ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలతో పాటు, ఇతర


ఏలూరులో ముగ్గుల పోటీలు

ఆటలు పోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల యజమాన్యం బహుమతి ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఫణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి పండుగ తెలుగువారి సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీక అని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్, అప్ ల్యాండ్ క్షత్రీయ సేవా సమితి ప్రతినిధి ముదునూరి నరసింహరాజు అన్నారు. శుక్రవారం అప్‌లాండ్ క్షత్రీయ సేవా సమితి, అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ ఏరియా వ్యాయామ, ఆరోగ్య అభిలాషుల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. సేవా సమితి అధ్యక్షులు గోరింట విజయరామరాజు, సిటీ బ్యాంక్ అధ్యక్షులు పెన్మెత్స రంగరాజు భోగి మంటలు వెలిగించి వేడుకలు ప్రారంభించారు. మహిళలు మ్యూజికల్ చైర్స్ ఆడారు. సాంప్రదాయ పిండి వంటలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ పట్టణంలో అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ వద్ద వాలీబాల్ కోర్టు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు రంగరాజు చేసిన కృషిని కొనియాడారు. క్రీడాభివృద్ధికి అప్ ల్యాండ్ క్షత్రియ సేవా సమితి చేస్తున్న కృషిని వివరించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ, క్రీడలను ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా సహకరిస్తున్న నరసింహరాజు, రంగరాజు, గోరింట విజయ రామరాజు, అట్లూరి రామరాజును వాకర్స్, వ్యాయామ, ఆరోగ్య అభిలాషులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దండు ధనరాజు, ఐకార్ మెంబర్ అర్జుల మురళీకృష్ణ, ఐజెయు జాతీయ కౌన్సిల్ సభ్యులు వాసా సత్యనారాయణ, వ్యాయామ శిక్షకుడు అట్లూరి రామరాజు, ఔత్సాహిక వ్యాయామ అభిలాషులు కొప్పిశెట్టి వెంకట సూరిబాబు, గుబ్బల వెంకట సత్య ప్రసాద్, విజ్జు శంకర్, రామకృష్ణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో..

లక్కవరంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లక్కవరం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలను ఎమ్మెల్యే ఎలిజా ప్రారంభించారు. ఈ క్రమంలో భోగి మంటలు వెలిగించి సంబరాలు ఆరంభించారు. అనంతరం ఎలిజా, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ సాంప్రదాయ కోడిపందేల్లో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొదమ జ్యోతి, మండల అధ్యక్షులు వామిసెట్టి హరిబాబు, లక్కవరం సర్పంచి గెల్లా వెంకటరమణ, మండల యువ నాయకులు గంజి వినోద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి: సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలు వద్దు సాంప్రదాయ క్రీడలే ముద్దు అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. అంతేకాకుండా యువత సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యసనాల బారినపడకుండా వాలీబాల్ పోటీలను నిర్వహించామని తెలిపారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు.

టి.నరసాపురం : యువత సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యతివ్వాలని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు శుక్రవారం కబడ్డీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో యువత జూదం, కోడి పందేలు, గుండాట వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.


టి.నరసాపురంలో..


క్రీడా దుస్తులు అందిస్తున్న సబ్ కలెక్టర్

ఆటల పోటీల నిర్వహణ అభినందనీయం

సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూదక్రీడల వైపు మొగ్గు చూపకుండా సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. బెత్సెద ఇంటిగ్రేడ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీల్లో భాగంగా ఆయన క్రీడాకారులకు క్రీడా దుస్తులను శుక్రవారం అందజేశారు. ఆగిరిపల్లి, ఈదర గ్రామాలకు చెందిన 25 మంది వాలీబాల్ క్రీడాకారులకు ఆగిరిపల్లి శ్రీ భాగ్యలక్ష్మీ ఇండేన్‌గ్యాస్ మేనేజింగ్ పార్టనర్ పాలడుగు వెంకట శ్రీనివాసరావు అందజేసిన క్రీడా దుస్తులను సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అసిస్టెంట్ సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ చేతుల మీదుగా అందజేశారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

ఆచవరంలోని శ్రీసంతాన వేణుగోపాల స్వామిని శాసన సభ్యులు దూలం నాగేశ్వరావు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు టౌన్ సిఐ ఎంవిఎస్ నాగరాజు, ఎంపిపి అడివి వెంకటకృష్ణ మోహన్, వైసిపి మండల అధ్యక్షులు బట్రాజు శివాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.


హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న అధికారులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ జెవి.సుబ్బారావు హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో జూదాలు నిషేధించాలని కోరుతూ శుక్రవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు, గుండాట, కోసాట, జూదం వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ అడపా సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సూచనలివ్వడంలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - ముసునూరు

సాగులో రైతులకు అవసరమైన అన్నిరకాల సలహాలు, సూచనలు అందించాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావును వ్యవసాయశాఖ సలహా మండలి కమిటీ కోరింది. శుక్రవారం మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, సలహా మండలి సభ్యులు పలు సమస్యలను వివరించారు. పంట వేసిన తర్వాత రైతులకు యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు ఇవ్వడంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది విఫలమవుతున్నారన్నారు. కార్యాలయానికే పరిమితమవుతున్నారని, భవిష్యత్‌లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మగ్గుచూపుతున్న సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. తక్షణం ఆ శాఖను అప్రమత్తం చేయాలని వ్యవసాయశాఖను కోరారు. రబీ పంట సీజన్‌లో మిరప, మొక్కజొన్న, పొగాకు పంటలో వచ్చిన నల్లి (తామర)పురుగు నివారణకు రైతులకు సూచనలు ఇవ్వాలని, పిఎం కిసాన్ లబ్ధిపొందని రైతుల ఇకెవైసి చేయించాలని కోరారు. ఈ సమావేశంలో సలహా కమిటీ అధ్యక్షులు సిహెచ్.కాంతారావు, గాజుల ఏడుకొండలు, తులిమెల్లి సుబ్బారావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న రైతులు, సలహామండలి సభ్యులు

కోడి పందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - గణపవరం

సంక్రాంతి సందర్భంగా మండలంలో పిప్పర, కాశీపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేలు బరులను శుక్రవారం గణపవరం పోలీసులు ధ్వంసం చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు గ్రామాల్లో కోడిపందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేసినట్లు చెప్పారు. పండుగ రోజుల్లో కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. కోడిపందేలు నిర్వహించినవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



జగనన్న గృహాలకు డిఎన్ఆర్ శంకుస్థాపన

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కైకలూరులోని వైఎస్ఆర్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ ఆర్త హోమ్స్ వారి నిర్మాణ భాగస్వామ్యంతో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఆయన భూమిపూజకు హాజరయ్యారు. సింహాద్రి సరస్వతి - రామచంద్రరావు, మల్లంపల్లి కౌసల్య - ధర్మారావు దంపతులు నిర్మించుకుంటున్న ఇళ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణమోహన్, వైస్ఎంపిపి మహ్మద్ జహీర్, సర్పంచి నవరత్న కుమారి పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

సామాజిక న్యాయం కోసం ఎంఎస్‌పి కృషి


ప్రజాశక్తి - చాట్రాయి

కులాల ప్రాతిపదికన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసమే మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పి)ని సామాజిక ఉద్యమ నాయకులు మందా కృష్ణమాదిగ ఏర్పాటు చేశారని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో శుక్రవారం దళిత బహుజన నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం, రాజకీయం న్యాయం అనేవి నేటికీ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్ ఏర్పడిన 28 సంవత్సరాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను కలుపుకొని అనేక సామాజిక ఉద్యమాలను నిర్వహించిందని ఆ ఉద్యమాల ఫలితంగానే ఆరోగ్యశ్రీ నుండి వికలాంగుల పెన్షన్, వృద్ధుల, వితంతువుల, ఒంటరి మహిళల పెన్షన్ల వరకూ సాధించిన ఘనత ఎంఆర్‌పిఎస్ వర్గీకరణ ఉద్యమానికే దక్కుతుందన్నారు. అయితే ఇప్పటివరకు అధికారం లోకి వచ్చిన ఏ పార్టీ కూడా అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం అమలు చేయడం లేదని, జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజకీయ పదవులు అందరికీ సమానంగా దక్కాలంటే మహాజన సోషలిస్టు పార్టీతో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం చాట్రాయి మండల కన్వీనర్‌గా మొలుగుమాటి రవిరామ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మాజీ అధ్యక్షులు కొమ్ము ప్రసాద్, మాజీ ఎంపిటిసి కలపాల రమేష్, సుజాన్ రావు, చాట్రాయి మాజీ సర్పంచి కోటా జోషి, చీపురు గూడెం మాజీ సర్పంచి ఘంటసాల మన్మధరావు, కారుమంచి ధనూష్,డి పుల్లారావు పాల్గొన్నారు.

గాయపడిన విలేకరికి పరామర్శ

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుంటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విలేఖరి శివను శుక్రవారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పరామర్శించారు. మండలంలోని విశ్వనాద్రిపాలేనికి చెందిన విలేకరి శివ ఈనెల తొమ్మిదో తేదీన గుంటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంపిపి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైసిపి నాయకులు బొర్రా శేషుబాబు, రాచూరి కుమార్, దివి సతీష్ గంటా కోటేశ్వరరావు , తాడంకి రాజేష్ శివను పరామర్శించారు.


జనన ధృవీకరణ పత్రం అందిస్తున్న అధికారులు

24 గంటల్లో జనన ధృవీకరణ పత్రం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిడ్డ పుట్టిన 24 గంటల్లో జనన ధృవీకరణ పత్రం అందజేస్తున్నట్లు ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. కేంద్రంలో మగ బిడ్డకు జన్మనిచ్చిన పి.మౌనికకు బిడ్డకు సంబంధించిన జనన ధృవీకరణ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జె.విల్సన్ బాబు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పొగాకులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పొగాకు సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సిటిఆర్ఐ మేనేజర్ ఎంవి.జయకృష్ణ తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి సిటిఆర్ఐలో పొగాకు పంటలో రసాయన ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొగాకు సాగులో క్రిమి సంహారక మందులు వాడకం తగ్గించి ప్రకృతి సిద్ధ ఎరువులను వినియోగించాలని సూచించారు. దీనిద్వారా మేలైన పొగాకు పండి, అధిక దిగుబడులు వస్తాయని రైతులకు తెలిపారు. అదే విధంగా ఆకు మడత తెగులును కలుగజేసే తెల్ల దోమలను తోట చుట్టు బంతి పూల తోటలను వేసి నివారించవచ్చని తెలిపారు. ఎస్‌సి సబ్ ప్లాన్ పరిధిలోని రైతులకు బంతి నారు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ ఫార్మ్ అసిస్టెంట్ రమేష్, సింహాచలం, ప్రభు పాల్గొన్నారు.